క్లుప్తంగా

నర్సరీ పరిశీలన



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కడ్తాల్: మండల పరిధి మక్తమాదారం గ్రామంలోని నర్సరీని ఎంపీడీఓ సుజాత గురువారం పరిశీలించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని, నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని, పిచ్చి మొక్కలు లేకుండా చూడాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది, కూలీలు ఉన్నారు.

'బీఆర్ఎస్‌లో చేరింది కాంగ్రెస్ వారు కాదు'



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరు కూడా బీఆర్ఎస్‌లో చేరలేదని మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామునాయక్ అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన వారికి గులాబీ కండువాలు కప్పి అధికార పార్టీ శ్రేణులు ఆ పార్టీలో చేరినట్లు బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గురువారం మండల పరిధి గోవిందాయిపల్లి తండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారికే కండువాలు కప్పుకుంటూ, కాంగ్రెస్ కార్యకర్తలు చేరారని అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నిరంజన్‌నాయక్, భాస్కర్, పాండు, హనుమా, సికిందర్, శ్రీను, ప్రేమ్, చందర్ తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ప్రభుత్వ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆదివాసీ విభాగం చైర్మన్ విస్లావత్ లింగ్యానాయక్ కోరారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ సర్కార్ మెస్ చార్జీలను పెంచిందని చెప్పారు. పట్టణంలోని కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల విద్యాలయం, బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలను గురువారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు తాగునీరు అందించాలని, మరుగుదొడ్లు, మూత్రశాలలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అలీం, కృష్ణనాయక్, భాస్కర్‌నాయక్, శివనాయక్, శ్రీను, శ్రీధర్‌నాయక్, రాజేందర్, హరిలాల్, రమేశ్, హరి, ఆయా పాఠశాలల ప్రత్యేకాధికారులు పద్మజ్యోతి, నేనావత్ గోపాల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం తగదు

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: ఈజీఎస్ నర్సరీలో మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం తగదని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి గడ్డమల్లయ్యగూడ, గునుగల్, చౌదర్‌పల్లి గ్రామాల్లోని నర్సరీలను గురువారం ఆయన పరిశీలించారు. జూన్ నెలలో వర్షాలు కురిసిన వెంటనే నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. జాబ్ కార్డులున్న వారందరూ ఉపాధి పనులకు వచ్చేలా చైతన్యం కల్పించాలని సూచించారు. ఈజీఎస్ ఏపీఓ లింగయ్య ఉన్నారు.

కళాశాల నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్: దాతల సహకారంతో షాద్‌నగర్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి గురువారం వేంకటేశ్వర హార్చరీస్ సంస్థ సభ్యులు రూ.25 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు సంస్థ జనరల్ మేనేజర్ కేజీ ఆనంద్, ఫైనాన్షియల్ మేనేజర్ శ్రీనివాసరావు విరాళానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. నాయకులు చెంది తిరుపతిరెడ్డి, అల్వాల్‌రెడ్డి, రవికుమార్ ఉన్నారు.

ఆదిబట్లలో అక్రమాల జోరు!

ఆదిబట్ల మున్సిపాలిటీ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది. ఓ వైపు గృహనిర్మాణాలు, మరో వైపు వాణిజ్య భవనాలు అడ్డగోలుగా వెలుస్తున్నాయి. కొందరు రాత్రికి రాత్రే రేకుల షెడ్లు నిర్మిస్తూ.. అద్దె రూపంలో రూ.లక్షలు దండుకుంటుండగా.. మరి కొందరు ట్రేడ్ లైసెన్సు పొందకుండా వ్యాపారం చేస్తూ.. మున్సిపల్ ఖజానాకు గండి కొడుతున్నారు.

విచ్చల విడిగా వెలుస్తున్న వ్యాపార సంస్థలు

- నిత్యం పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు
- ట్రేడ్ లైసెన్స్ లేకుండా కొనసాగుతున్న దుకాణాలు
- మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి
- నోటీసులు సిద్ధం చేసిన అధికారులు



ఆదిబట్ల పురపాలక సంఘం కార్యాలయం

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర రాజధానికి అతి సమీపంలో ఉన్న ఆదిబట్ల పురపాలక సంఘం అభివృద్ధిలో దూసుకుపోతోంది. టీసీఎస్, ఏరోస్పేస్, ఫాక్స్‌కాన్, కలెక్టరేట్ కార్యాలయం, ఔటర్ రింగ్ రోడ్డు ఇక్కడే ఉండటంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. టీసీఎస్‌లో వేలాది మంది ఉద్యోగులు ఉండటంతో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణ ప్రణాళిక అధికారులు, అక్రమ నిర్మాణాలు, వ్యాపారాలను కట్టడి చేస్తున్నప్పటికీ.. కొందరు అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా అక్రమ కట్టడాలు, వ్యాపారం చేస్తూ.. సవాల్‌గా నిలుస్తున్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేకుండా..

మున్సిపాలిటీలో ఆదిబట్ల, కొంగరకలాన్, ఎంపీ పటేల్‌గూడ, బొంగ్లూర్, రాందాస్‌పల్లి, మంగళ్‌పల్లిలు కలిపి 15 వార్డులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆదిబట్ల గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చెందుతోంది. వాణిజ్య, వ్యాపార సంస్థలతో పాటు హాస్టళ్లకు నిలయంగా మారింది. ఈ ప్రాంతంలో ఇంజినీరింగ్ కళాశాలలు, టీసీఎస్ తదితర సంస్థలు ఉండటం వలన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించింది. ఈ ప్రాంతంలో ఇతర రాష్ట్రాల ప్రజలు నివాసం ఉంటున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అనేక దుకాణ సముదాయాలు వెలుస్తున్నాయి. వ్యాపార సంస్థలు కొనసాగించాలంటే తొలుత మున్సిపాలిటీ నుంచి (ట్రేడ్ లైసెన్స్) అనుమతి పత్రం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు 900 లైసెన్సులు మాత్రమే ఉండగా.. వాటి నుంచి ఏటా రూ.25 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. అక్రమంగా వ్యాపారం చేస్తున్నవారు అనుమతి పొందితే ఆదాయం పెరగనుందని, ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అడ్డగోలుగా..

ఆదిబట్ల టౌన్, మంగళ్‌పల్లిలో అడ్డగోలుగా వ్యాపార సంస్థలు పుట్టుకొచ్చాయి. టీసీఎస్ ముందు, మంగళ్‌పల్లి వద్ద హాస్టళ్లు 200 వరకు ఉన్నాయి. వీటి నిర్వాహకుల్లో ఎవరు కూడా మున్సిపాలిటీ నుంచి అనుమతి పత్రాలు తీసుకోకుండానే వ్యాపారాలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కొంతమంది భారీగా షెడ్ల నిర్మాణం చేపట్టి, అధికంగా మడిగెలు వేసి అద్దె రూపంలో రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నారు. మంగళ్‌పల్లిలో ఒక వ్యాపారి ఏకంగా రోడ్డుకు ప్రక్కనే 20కి పైగా షెట్టర్లను అద్దెకు ఇచ్చారు. ఇలా చిన్న వ్యాపారి నుంచి బడా వ్యాపార వేత్తల వరకు ఇదే తంతు కొనసాగిస్తున్నారు. మరో 300 వరకు ట్రేడ్ లైసెన్స్‌లు పొందితే.. రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పురపాలికకు అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

లైసెన్స్ లేకుంటే చర్యలు



మున్సిపాలిటీలో ట్రేడ్ లైసెన్స్ పొందకుండా వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించాం. ఎవరినీ వదిలి పెట్టం. పురపాలికకు ఆదాయం పెంచడమే లక్ష్యంగా పని చేస్తాం. మరో 300లకు పైగా లైసెన్సులు తీసుకోవాల్సి ఉంది. నోటీసులు సిద్ధం చేశాం. అనుమతి తీసుకోని వారిపై చర్యలు తీసుకుంటాం

– ఎస్.బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదిబట్ల



మల్లప్పగుట్టపై మల్లికార్జునస్వామి ఆలయం (ఇన్‌సెట్లో) ఆలయంలో కొలువైన స్వామివారు

బ్రహ్మోత్సవాలకు వేళాయె

- రేపటి నుంచి 28 వరకు మల్లప్పగుట్ట ఉత్సవాలు
- 25న అగ్నిగుండం, 26న మల్లికార్జునస్వామి కల్యాణం

ఆమనగల్లు: మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలకు వేళయింది. నెల 22 నుంచి 28 వరకు బ్రహ్మోత్సవాలు జరగనుండగా.. ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామ సమీపంలో ఎత్తైన కొండలపై వెలసిన మల్లప్పగుట్ట శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఏటా వారం రోజుల పాటు వైభవంగా ఉత్సవాలు జరుగుతుంటాయి. ఈ ఏడు కూడా ఉత్సవాలు నిర్వహించడానికి ఆలయ కమిటీ చైర్ పర్సన్ ఏమిరెడ్డి కొసల్యమ్మ, గౌరవ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, అధ్యక్షుడు పాండయ్యలు ఏర్పాట్లు చేస్తున్నారు.

గుట్టపై మునుల తపస్సు

చెన్నారం గ్రామ సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారికి ఐదుకిలో మీటర్ల దూరంలో మల్లప్పగుట్టపై మల్లికార్జునుడు కొలువుదీరాడు. గుట్టపై మునులు తపస్సు చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. స్వామివారికి ఎదురుగా ఉన్న గుండంలో ఏ కాలంలో నైనా నీరు ఉండటం విశేషం. భక్తులు ఇందులో స్నానం చేసి, మల్లికార్జుడిని దర్శనం చేసుకుంటారు.

దినదినాభివృద్ధి

దాతల సహకారంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. గతంలో కొండపైకి వెళ్లడానికి మెట్లు ఉండేవి కావు. ప్రస్తుతం ఆలయాన్ని పెద్దగా నిర్మించడంతో పాటు.. గుట్టపైకి చేరుకోవడానికి రూ.75 లక్షలతో సీసీరోడ్డు నిర్మించారు. దేవాలయం వద్ద భారీ మండపం, భక్తులు ఉండటానికి గదులు నిర్మించారు.

రోజువారి కార్యక్రమాలు

ఈ నెల 22 నుంచి 28 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. 22న సాక్షిగణపతి ప్రతిష్ఠ, అంకురార్పణ, ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 23న గణపతి మంటప పూజలు, యంత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, 25 తెల్లవారు జామున అగ్నిగుండ మహోత్సవం, ప్రత్యేక పూజలు, 26న ఉదయం గణపతి పూజ, స్వామివారికి అభిషేకం, అనంతరం భ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం, 27న కడవ బోనాలు, 28న చక్రతీర్థం, పెద్ద మంగళహారతి కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

'సిరిపురం' త్యాగం మరువలేనిది



మహేశ్వరం గేటు వద్ద యాదయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆత్మ బలిదానం చేసిన సిరిపురం యాదయ్య త్యాగం మరువలేనిదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. యాదయ్య వర్ధంతి సందర్భంగా గురువారం మహేశ్వరం గేటు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీ గేటు వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మార్పణ చేసుకున్నారని తెలిపారు. ఆయన మరణం తర్వాత తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేసిందన్నారు. యాదయ్య మహేశ్వరం మండలం నాగారం గ్రామ వాసి కావడం గర్వకారణమన్నారు. ఆయన త్యాగం వృథా కాకుండా సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, ఎస్సీసెల్ మండల మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజునాయక్, శివగంగ ఆలయ చైర్మన్ అల్లె కుమార్, నాయకులు అందుగుల సత్యనారాయణ, శివగళ్ల యాదయ్య, శివ యాదవ్, హరికృష్ణ, దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

హుడాకాంప్లెక్స్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా గురువారం కొత్తపేట చౌరస్తాలో ఆయన విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీయూఎఫ్ ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధుయాష్కిగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, చిలుక ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డును విస్తరించండి



ఎమ్మెల్యే మల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

యాచారం: కడ్తాల్– యాచారం మండలాల సరిహద్దును కలిపే నక్కర్తమేడిపల్లి– పల్లెచల్క తండా రోడ్డును విస్తరించాలని పలువురు నాయకులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరారు. గురువారం నగరంలోని ఆయన నివాసంలో సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నక్కర్తమేడిపల్లి, పల్లెచల్కతండా గ్రామాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. రహదారి విస్తరణకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆలంపల్లి నర్సింహ, ముచ్చర్ల సంపత్‌కుమార్, ముంత జంగయ్య, శ్రీనునాయక్, రవీందర్‌గుప్తా పాల్గొన్నారు.

ఆడబిడ్డల వివాహానికి చేయూత

ఆర్థిక సహాయం, సామగ్రి అందజేసిన నేతలు



ఆర్థిక సాయం అందజేస్తున్న దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్: పేదింటి ఆడబిడ్డల వివాహానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ రూ.42 వేలు ఆర్థిక సాయంతో పాటు, పట్టు చీరలను అందజేశారు. గురువారం ఆయన మండల కేంద్రానికి చెందిన కానుగుల అలివేలు–నాగయ్య దంపతుల కూతురు విజయలక్ష్మీ వివాహానికి రూ.21 వేలు, కానుగుబావితండాకు చెందిన నేనావత్ రాజు–అనిత కూతురు ఝాన్సీ వివాహానికి రూ.21 వేలను కానుకగా ఇచ్చారు. అదే విధంగా ఝాన్సీ వివాహానికి సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యానాయక్ రూ.25 వేలు, మాజీ ఉప సర్పంచ్ శారద పాండునాయక్ రూ.50వేలు, వార్డు మాజీ సభ్యుడు నేనావత్ లక్ష్మణ్ రూ.75వేలు, బీఆర్ఎస్ నాయకులు శ్రీను రూ.10 వేలు, వార్డు మాజీ సభ్యుడు భీమన్ రూ.4వేలు, శంకర్‌నాయక్ రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మాజీ సభ్యుడు ఆనంద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు లాయక్‌అలీ, దాసు, మహేశ్, కిషన్, శ్రీకాంత్, వెంకటేశ్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

ఎంపీఓగా లాలయ్య



కడ్తాల్: కడ్తాల్ మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ)గా ఎల్. లాలయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కొందుర్గు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ ఎంపీఓగా పని చేసిన విజయ్‌కుమార్‌పాల్.. కొందుర్గు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా లాలయ్య మాట్లాడుతూ, ప్రజలకు అందబాటులో ఉండి, గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అంతకు ముందు లాలయ్యను ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

అప్పుడే ఎండలు



యాచారం మండలం నక్కర్తమేడిపల్లిలో ఎండిపోయిన చెరువు

ఎండల తీవ్రత పెరిగింది. రాత్రి వేళల్లో చలి, పగటి పూట ఎండ మంట పుట్టిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గడిచిన వారం రోజులుగా భానుడి ప్రతాపానికి పొలాల్లో నీరు ఆవిరైపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసిన పంటలు చేతికి వస్తాయో లేవోనని కలత చెందుతున్నారు.

- పడిపోతున్న భూగర్భ జలాలు
- అడుగంటుతున్న చెరువులు, కుంటలు
- పంటలు చేతికొస్తాయే లేవోనంటూ రైతుల ఆందోళన
- బోరుబావుల తవ్వకంపై దృష్టి

యాచారం: మహా శివరాత్రి రానే లేదు. అప్పుడే సూరీడు తన ప్రతాపం చూపుతున్నాడు. భానుడి భగభగలకు పొలాలు నెర్రలు వారుతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉండబోతోందనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది వర్షాలు సమృద్ధిగా కురవలేదు. రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలకు డివిజన్‌లో కేవలం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు, చింతపట్ల లక్ష్మణ్ చెరువు మినహా మరే గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నీరు లేదు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో వ్యవసాయం పూర్తిగా బోరుబావుల పైనే ఆధారపడి ఉంటుంది.

వట్టిపోయిన బోరుబావులు

ఈ నాలుగు మండలాల్లో సుమారు 20 వేలకు పైగానే వ్యవసాయ బోరుబావులు ఉన్నాయి. గడిచిన రెండేళ్లుగా ఆశించిన మేర వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. దీంతో బోరుబావుల్లో సగానికి పైగా భూగర్భజలాలు పడిపోగా, మరికొన్ని వట్టిపోయాయి. యాచారం మండల పరిధి కొత్తపల్లి, తక్కళ్లపల్లి, నల్లవెల్లి, మాల్, మొండిగౌరెల్లి, మల్కీజ్‌గూడ, నక్కర్తమేడిపల్లి, గడ్డమల్లయ్యగూడ, మంచాల మండలం మంచాల, జాపాల, ఆరుట్ల, చెన్నరెడ్డిగూడ, రంగాపూర్, చీదేడ్, దాద్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలంలోని పొల్కంపల్లి, రాయపోల్, దండుమైలారం, తుర్కగూడ, చెర్లపటేల్‌గూడ గ్రామాల్లోని వ్యవసాయ బోరుబావులు అడుగంటాయి.

బోరుబావుల తవ్వకం



యాచారంలో తవ్వుతున్న బోరుబావి

సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో ఎండిపోతే నష్టపోతామని భావించిన రైతులు, బోరుబావుల తవ్వకంపై దృష్టి సారించారు. డివిజన్ పరిధి పలు మండలాల్లో నిత్యం వందకు పైగానే బోరుబావులు తవ్వుతున్నారు. 200 నుంచి 500 అడుగుల లోతు వరకు తవ్విస్తున్నారు. పలుచోట్ల కొద్దిపాటి తవ్వకానికే.. నీరు వస్తుండగా కొన్ని చోట్ల 500 అడుగుల లోతుకు పైగా తవ్వినా చుక్క నీరు పడటం లేదు.

పంటలు చేతికొచ్చేనా?



ఎల్లమ్మతండా లోయపల్లి గ్రామాల మధ్య సాగుచేసిన వరి పంట

యాసంగి కాలం కింద డివిజన్ పరిధి పలు మండలాల్లో 18 వేల ఎకరాల్లో వరి, ఏడు వేల ఎకరాల్లో పలు రకాల కూరగాయల పంటలు సాగవుతున్నాయి. మంచాల మండలం లోయపల్లి, బోడకొండ, ఎల్లమ్మతండా, ఆరుట్ల, రంగాపూర్, చీదేడ్, ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్, దండుమైలారం, పోల్కంపల్లి, యాచారం మండలం చింతపట్ల, తమ్మలోనిగూడ, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో అత్యధికంగా వరి సాగు చేశారు. యాచారం మండల పరిధి చౌదర్‌పల్లి, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, మొండిగౌరెల్లి, మంచాల మండలంలో జాపాల, చిత్తపూర్, ఆరుట్ల, ఇబ్రహీంపట్నం మండల పరిధి తుర్కగూడ, కర్ణంగూడ, పోచారం, ఎలిమినేడ్ తదితర గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరలను సాగు చేస్తున్నారు. ఆకుకూరలు స్వల్పకాలంలోనే దిగుబడి వస్తుండగా, వరి, కూరగాయల సాగు చేతికి రావాలంటే రెండు, మూడు నెలల సమయం పడుతుంది. ఈ లోపు ఎండ తీవ్రత పెరిగితే ప్రస్తుతం కొద్దిపాటి భూగర్భ జలాలు అందించే బోరుబావులు కాస్త.. ఎండిపోయే అవకాశం ఉందని కర్షకులు ఆందోళన చెందుతున్నారు.

ఆరెకరాల్లో సాగు చేశా



మూడు బోరుబావుల కింద ఆరు ఎకరాల్లో వరి, కూరగాయలు, పశుగ్రాసాన్ని సాగు చేశాను. పక్షం రోజుల క్రితం నుంచే క్రమంగా బోరు బావుల్లో నీరు తగ్గుతూ వస్తోంది. శివరాత్రి రాకముందే ఎండల తీవ్రత పెరిగి పొలాల్లోని నీరు ఆవిరైపోతోంది. పంటలు చేతికి వస్తాయో లేవో.. రూ.లక్షన్నరకు పైగానే పెట్టుబడి పెట్టాను.

– మేకల యాదగిరిరెడ్డి, రైతు మొండిగౌరెల్లి

11 బావులు తవ్వినా.. నీరు రాలే



రెండు నెలల వ్యవధిలో రూ.7 లక్షలు ఖర్చు చేసి 11 బోరు బావులు తవ్వించాను. చుక్క నీరు రాలేదు. యాచారం పీఏసీఎస్‌లో రెండు ఎకరాల వ్యవసాయ పొలాన్ని తాకట్టు పెట్టి పౌల్ట్రీఫాం పెట్టాను. నీరు లేక నిరుపయోగంగా ఉంచాను. బోరుబావులకు అప్పులు చేశాను. ఎలా తీర్చాలో తెలియడం లేదు.

– వర్త్యవత్ మాన్‌సింగ్, బొల్లిగుట్టతండా

స్వల్పకాలిక పంటలపై దృష్టి పెట్టాలి



ఎండలు పెరుగుతున్నాయి. భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు స్వల్పకాలిక పంటలపై దృష్టి సారించాలి. ఆకు కూరలు, కూరగాయలను సాగు చేసుకోవాలి. డివిజన్‌లో 18 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– కాయితి సుజాత, ఏడీఏ ఇబ్రహీంపట్నం డివిజన్

చెడు వ్యసనాలకు బానిస కావద్దు


గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు

యాచారం: చెడు వ్యవనాలకు బానిస కావద్దు, బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు అన్నారు. పీఎస్ పరిధి మీరాఖాన్‌పేట గ్రామంలో గురువారం స్థానికులతో మాట్లాడారు. మద్యం, డ్రగ్స్, గంజాయి లాంటి వాటికి అలవాటు కావద్దని చెప్పారు. నమ్ముకున్న వారిని దృష్టిలో పెట్టుకుని మసులుకోవాలని సూచించారు. ఎవరి పనులు వారు చేసుకుంటూ ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తే, భవిష్యత్తులో వారే మిమ్మల్ని పోషిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌ఐ తేజం రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



పూలు, చాదర్ తీసుకొస్తున్న ఎమ్మెల్యే

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్‌లోని బాబా షర్ఫొద్దీన్ దర్గాను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా దర్గాకు విచ్చేసిన ఆమె బాబాకు పూలు, చాదర్‌ను సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు ఆమెను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.